సాక్షి కరీంనగర్

I

శుక్రవారం | 20 | అక్టోబర్ | 2023



రామగిరి: లద్నాపూర్‌లో సింగరేణి కార్మికులతో ముచ్చటిస్తున్న రాహుల్ గాంధీ

న్యూస్‌రీల్

ల్యాడర్ పరేషాన్

- మరమ్మతులతో పండుగపూట ఇక్కట్లు



నగరపాలక సంస్థ ఆవరణలో ల్యాడర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరమంతా దసరా సందడి. 60 డివిజన్లలో వెలుగులు నింపాల్సిన పరిస్థితి. ఇలాంటి కీలక సమయంలో నగరపాలకసంస్థ ల్యాడర్ పరేషాన్ చేస్తోంది. వీధిదీపాలు అమర్చేందుకు, మరమ్మతు చేసేందుకు ఉపయోగించే ఏకైక ల్యాడర్ తరచూ మొరాయిస్తోంది. ల్యాడర్ క్యాబిన్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. సిబ్బంది సహనాన్ని పరీక్షిస్తోంది. సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన ఈ ల్యాడర్ పండుగల వేళ మరమ్మతులకు గురవుతోంది. రోడ్లు, వీధుల వెంట వీధిదీపాలు అమర్చుతూనో, మరమ్మతులు చేస్తూనో కనిపించాల్సిన ల్యాడర్ గత పదిహేను రోజులుగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నిలిచి ఉంది. ల్యాడర్ రిపేర్‌కు రావడంతో వీధిదీపాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. నవరాత్రుల్లో వీధిదీపాలు ప్రధానం కాగా, ల్యాడర్ లేకపోవడంతో సంబంధిత కార్పొరేటర్లు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏజీపీగా మంచికట్ల రాజేశం



మంచికట్ల రాజేశం

కరీంనగర్‌క్రైం: జిల్లా రెండో అదనపు సెషన్స్ (ఎల్‌ఆర్ఏటీ) కోర్టుకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (అదనపు ప్రభుత్వ న్యాయవాది)గా కరీంనగర్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మంచికట్ల రాజేశంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజేశం ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించి దాఖలయ్యే ల్యాండ్ అప్పిలెట్ రిఫార్మ్ కేసుల్లో వాదిస్తారు. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన రాజేశం 26 ఏళ్లనుంచి జిల్లాకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఈయన నియామకంపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, రాష్ట్ర సక్సెషన్ కోర్టు జడ్జి బల్మూరి మహేందర్‌రావు, ప్రభుత్వ న్యాయవాది వేణుగోపాలరావు హర్షం వ్యక్తం చేశారు.

ఓపెన్ పరీక్షలకు 80 శాతం హాజరు

కరీంనగర్: ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు 80శాతం హాజరయ్యారని డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వర్‌రావులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉదయం ఎస్ఎస్‌సీ పరీక్షకు 132మందికి 111మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇంటర్‌లో 27మందికి 19మంది హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం పదో తరగతికి ఆరుగురు విద్యార్థులకు ఐదుగురు విద్యార్థులు హాజరయ్యారని, ఇంటర్‌లో 55మందికి 45 మంది హాజరయ్యారని తెలిపారు.



కరీంనగర్‌లో పాదయాత్రగా కార్నర్ మీటింగ్‌కు వస్తున్న రాహుల్‌గాంధీ

జంగ్ తెలంగాణ

హామీలిస్తూ.. భరోసా నింపుతూ..

రాహుల్ పర్యటన సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

- గ్యారంటీలను వివరిస్తూ.. అవినీతిని ఎండగడుతూ
- బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలపై ఘాటు విమర్శలు
- మంథని, పెద్దపల్లి, కరీంనగర్ కార్నర్ మీటింగ్స్‌లో రాహుల్‌గాంధీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి,పెద్దపల్లి/మంథని/రామగిరి/పెద్దపల్లిరూరల్/కరీంనగర్‌టౌన్: ఉమ్మడి జిల్లాలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ పర్యటన కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ.. సింగరేణి కార్మికులకు హామీలిస్తూ.. భరోసా నింపుతూ పాదయాత్ర సాగింది. రాహుల్‌గాంధీ విజయభేరి యాత్ర గురువారం మంథనిలో ప్రవేశించింది. కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించిన అనంతరం లద్నాపూర్‌లో సింగరేణి కార్మికులతో సమావేశమయ్యా రు. మధ్యాహ్నం సెంటీనరీకాలనీ గెస్ట్‌హౌస్‌లో భో జనం చేశారు. అక్కడి నుంచి బస్సుయాత్ర కమాన్‌పూర్, సబ్బితం మీదుగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బహిరంగసభ వరకు సాగింది. సభ అనంతరం కరీంనగర్ చేరుకున్న రాహుల్‌గాంధీ మారుతీనగర్ చౌరస్తా నుంచి రాజీవ్‌చౌక్ వరకు వేలాదిమంది కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేశారు. కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు.



పెద్దపల్లిలో జరిగిన సభలో కళాకారుల ఆటాపాటా



రాహుల్ గాంధీకి గద అందించిన పెద్దపల్లి కాంగ్రెస్ నాయకులు

జనసంద్రమైన పెద్దపల్లి

పెద్దపల్లిలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగసభకు జనాలు పోటెత్తారు. గ్రౌండ్ నిండిపోవడంతోపాటు రాజీవ్‌రహదారి కిలోమీటర్ల మేర జనంతో కిక్కిరిసింది. 'రాహుల్ పీఎం.. పీఎం..' అనే నినాదాలతో సభ ప్రాంగణం మార్మోగింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి విజయరమణారావు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో నీరాజనం

కరీంనగర్‌లో పాదయాత్ర అశేష జనవాహిని మధ్య సాగింది. కరీంనగర్ అసెంబ్లీ స్థానానికి అభ్యర్థి పేరు ప్రకటించకపోవడంతో ఆశావహులు పెద్ద ఎత్తున జనసమీకరణ చేశారు. పార్టీ టికెట్ దక్కించుకునేందుకు తమ బలగంతో ఎమ్మెల్యే సీటు ఆశావహులు కొత్త జయపాల్‌రెడ్డి, కొమిటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎం.రోహిత్‌రావు, పురుమళ్ల శ్రీనివాస్ తరలివచ్చారు. ఈ పాదయాత్రలో మానుకొండూర్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల భారీ భద్రత

కరీంనగర్‌లోని మారుతీనగర్ చౌరస్తా నుంచి రాజీవ్ చౌక్ వరకు రాహుల్‌గాంధీ పాదయాత్ర కొనసాగగా జిల్లా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పోలీసు కమిషనర్ సుబ్బారాయుడు, అసిస్టెంట్ కమిషనర్ నరేందర్ భద్రత ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

పర్యటన సాగింది ఇలా..



- జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి మంథని నియోజకవర్గంలోని కాటారం మండల కేంద్రానికి రాహుల్‌గాంధీ దాదాపు రెండు గంటలు ఆలస్యంగా గురువారం ఉదయం 11.14 గంటలకు ప్రత్యేక కాన్వాయ్‌లో చేరుకున్నారు.
- కాటారం నుంచి కొయ్యూర్ మీదుగా మంథనికి మధ్యాహ్నం 1.01 గంటలకు వచ్చారు. ఇక్కడ బస్సుపై నుంచి ప్రజలను ఉద్దేశించి 32 నిమిషాలు మాట్లాడారు.
- మధ్యాహ్నం 1.46 నిమిషాలకు మంథని నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుతో కలిసి రాహుల్ గాంధీ రోడ్డు మార్గంలో రామగిరి మండలం లద్నాపూర్ చేరుకున్నారు. మధ్యాహ్నం 2.20 గంటలకు సింగరేణి కార్మికులతో మాటాముచ్చట నిర్వహించారు.
- సింగరేణి భవన్‌లో భోజనం చేసి మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరి, సాయంత్రం 4.14 గంటలకు కమాన్‌పూర్ చేరుకున్నారు.
- సాయంత్రం 4.19 నిమిషాలకు పెద్దపల్లి నియోజకవర్గంలోని సబ్బితం వద్దకు చేరుకోగా.. కాంగ్రెస్ శ్రేణులు బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు.
- సాయంత్రం 4.35 గంటలకు పెద్దపల్లిలో సభాస్థలికి చేరుకున్నారు.
- సాయంత్రం 5.45 గంటలకు ఇక్కడి నుంచి కరీంనగర్‌కు బయలుదేరారు.
- సాయంత్రం 6.40 గంటలకు కరీంనగర్‌లోని మారుతీనగర్ చౌరస్తాకు చేరుకొని.. పాదయాత్ర ప్రారంభించారు.
- సాయంత్రం 6.50 గంటలకు కాపువాడ చౌరస్తాలో రాహుల్‌గాంధీకి కాంగ్రెస్ శ్రేణులు క్రేన్ సహాయంతో గజమాల వేశారు.
- రాత్రి 7.00 గంటలకు నాకా చౌరస్తాకు చేరుకోగా ముస్లింలు స్వాగతం పలికారు.
- రాత్రి 7.10 గంటలకు పాతశిశుమందిర్ చౌరస్తాకు చేరుకోగా భవనాలపై నుంచి సుమారు 100 మీటర్ల పొడవున పూల వర్షం కురిపించారు.
- రాత్రి 7.20 గంటలకు రాజీవ్‌చౌక్‌కు చేరుకొని భారీ జనసందోహం మధ్యన బస్సుపై నుంచి కార్నర్ మీటింగ్‌లో 10 నిమిషాలు మాట్లాడారు.
- రాత్రి కరీంనగర్‌లోని వీ-పార్క్ హోటల్‌లో బస చేశారు.

ఆరు గ్యారంటీలతో..



ఆరు గ్యారంటీ పథకాలను వివరించేందుకే రాహుల్‌గాంధీ మన జిల్లాకు వచ్చారని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతి, ముంపు బాధితుల కష్టాలు రాహుల్‌కు వివరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చివరి ఆయకట్టు వరకు సాగునీరందేలా ప్రాజెక్టులు నిర్మిస్తామని ప్రకటించారు.

దాసరి.. ఇసుక దొంగ



రైతుబంధు ఇస్తున్నా ప్రభుత్వం, అంతకంటే ఎక్కువ విలువైన ధాన్యాన్ని కటింగ్ చేస్తూ రైతులను మోసం చేస్తుందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు విమర్శించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని, దాసరి మనోహర్‌రెడ్డి నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారన్నారు. దాసరి మనోహర్‌రెడ్డి మట్టి, ఇసుక, రేక, వడ్లను దోచుకెళ్తున్నాడని ఆరోపించారు. పెద్దపల్లి జిల్లాలోని ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు అవినీతిపరులేనన్నారు.

సాగునీరందలేదు..



రూ.27వేల కోట్ల అంచనాలతో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టు రూ.1.20లక్షల కోట్లకు చేరినా కొత్తగా ఒక్క ఎకరానికి సాగునీరు అందించలేకపోయారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. పెద్దపల్లిలో నేటికి నెహ్రూకాలంలో నిర్మించిన ఎస్సారెస్పీ కాల్వ ద్వారానే సాగునీరు అందుతుందని గుర్తు చేశారు.

13 ఏళ్లనాటి చార్జీలతో ఎలా?

- కాస్మొటిక్స్ ఖర్చేమో రూ.400.. ఇచ్చేది రూ.75
- 'డైట్'దీ ఇదే పరిస్థితి
- సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల ఇబ్బందులు
- జిల్లాలో 79 హాస్టళ్లు

'సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల బాగోగులే తమ లక్ష్యమని చెప్పుకునే ప్రభుత్వం వారిని చిన్నచూపు చూస్తోందన్న విమర్శలున్నాయి. ఏళ్లుగా విద్యార్థి, కుల సంఘాల నాయకులు ఆయా హాస్టళ్ల సమస్యలపై పోరాడుతున్నా.. నేటికీ ఎక్కువ సంఖ్యలో వసతి గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అరకొర వసతులు, సిబ్బందికి తోడు డైట్, కాస్మొటిక్ చార్జీలు, దుప్పట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ సకాలంలో అందడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.'

కరీంనగర్:

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో వసతి పొందుతూ చదువుకునే విద్యార్థులు కాస్మొటిక్ చార్జీల పెంపు కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 79 ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటిల్లో 8,367 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి కాస్మొటిక్, డైట్ చార్జీలను 13 ఏళ్లుగా పెంచడం లేదు. కానీ, బహిరంగ మార్కెట్‌లో వస్తువుల ధరలు మూడింతలు పెరిగాయి. దీంతో ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖమంత్రి హరీశ్‌రావులు విద్యార్థులకు కాస్మొటిక్,



డైట్ చార్జీలు పెంచుతున్నట్లు, గత జూలై నెల నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించారు. నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు.

2008–09లో పెంపు..

ప్రభుత్వం 3 నుంచి 10వ తరగతి చదివే బాలురకు నెలకు రూ.62 చొప్పున కాస్మొటిక్ చార్జీలు ఇస్తోంది. 3 నుంచి 7వ తరగతి వరకు బాలికలకు రూ.55, 8 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు రూ.75 చొప్పున చెల్లిస్తోంది. 2008–09 విద్యాసంవత్సరంలో పెంచినప్పటి నుంచి ఇవే చార్జీలు చెల్లిస్తున్నారు.

బాలికల ఖర్చు నెలకు రూ.400

ప్రస్తుతం మార్కెట్‌లో ధరల ప్రకారం బాలికలు నెలకు రూ.400 వరకు ఖర్చు చేస్తున్నారు. ఇందులో రెండు ఒంటి సబ్బులకు రూ.60, దుస్తుల సబ్బులకు రూ.34, కొబ్బరి నూనె డబ్బా రూ.60, షాంపూలకు రూ.8, పౌడర్ డబ్బాకు రూ.30, బొట్టుబిళ్లలు, రిబ్బన్లు, జడక్లిప్పులు, చెంప పిన్నీసులకు కలిపి రూ.60, శానిటరీ న్యాప్‌కిన్స్ కోసం రూ.100 వరకు ఖర్చవుతోంది.

బాలుర ఖర్చు రూ.300

బాలురు నెలకు రూ.300 వరకు ఖర్చు చేస్తున్నారు. ఇందులో 2 ఒంటి సబ్బులకు రూ.60, రెండు దుస్తుల సబ్బులకు రూ.34, కొబ్బరి నూనె డబ్బాకు రూ.30, క్షవరానికి రూ.70, షాంపూలకు రూ.8, పౌడర్ డబ్బాకు రూ.30 ఖర్చవుతున్నాయి.

పొంతన లేదు

ప్రభుత్వం ఇస్తున్న చార్జీలకు, విద్యార్థులు బహిరంగ మార్కెట్‌లో చెల్లిస్తున్న ధరలకు ఏ మాత్రం పొంతన ఉండటం లేదు. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలే వసతి గృహాలు, గురుకులాల్లో చదువుకుంటారు. ఇప్పుడు అదనంగా ఖర్చు చేయాల్సి రావడంతో వారిపై ఆర్థికభారం పడుతోంది.

ఉత్తర్వులు అందలేదంటున్న అధికారులు

ప్రభుత్వం ఇటీవల శాసనసభలో కాస్మొటిక్, డైట్ చార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు ఆ ఉత్తర్వులు తమకు అందలేదని సంక్షేమ శాఖ అధికారులు అంటున్నారు. డైట్ చార్జీలు 3 నుంచి 7వ తరగతుల విద్యార్థులకు గతంలో రూ.950 ఉండగా రూ.1,200కు పెంచింది. అలాగే 8 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు రూ.1,100 చెల్లిస్తుండగా రూ.1,400కు పెంచింది. ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1,500 చెల్లిస్తుండగా రూ.1,875 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఉత్తర్వులు రాకపోవడంతో 13 ఏళ్ల క్రితం చార్జీలతోనే విద్యార్థులు సరిపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

పెంచిన చార్జీలు చెల్లించాలి



రాష్ట్ర ప్రభుత్వం కాస్మొటిక్, డైట్ చార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. కానీ, అవి అమలు కావడం లేదు. జూలై నెల నుంచి ఇస్తుందనుకుంటే నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడం విచారకరం. పెంచిన చార్జీలను వెంటనే చెల్లించాలి.

– గజ్జెల శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

'కోడ్' ఎఫెక్ట్.. రిజిస్ట్రేషన్లు డౌన్

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు ప్రత్యేక నిబంధనలు
- ఎన్నికల సందర్భంగా నిత్యం పోలీసుల తనిఖీలు

కరీంనగర్ క్రైం: ఎన్నికల కోడ్ ప్రభావం రిజిస్ట్రేషన్ల మీద పడింది. ప్లాట్లు, ఇళ్లు, భూముల రిజిస్ట్రేషన్ మొత్తం నగదుతోనే ముడిపడి ఉంటుంది. భూముల కొనుగోలు, అమ్మకాల వ్యవహారాలన్నీ రూ.లక్షల్లో సాగుతాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ కొనసాగుతుండటంతో నగదు రవాణాకు పరిమితులు విధించారు. పోలీసులు నిత్యం తనిఖీలు చేపడుతున్నారు. రూ.50 వేలకు మించితే తగిన ఆధారాలు చూపించాల్సిందే. రిజిస్ట్రేషన్లు ఉంటే సంబంధిత పేపర్లు చూపిస్తే వదిలేస్తున్నారు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో కొనుగోలు, అమ్మకాలు పెట్టుకోవడానికి యజమానులు ఆసక్తి చూపించడం లేదు. ఫలితంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య పడిపోతోంది.

భారీగా తగ్గుతున్న ఆదాయం

అసెంబ్లీ ఎన్నికల కోడ్ ముగిసేవరకు రిజిస్ట్రేషన్లు తక్కువగానే అయ్యేలా ఉన్నాయని రిజిస్ట్రేషన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు చూపించినా మార్కెట్ విలువ కంటే క్రయవిక్రయాల ధర ఎక్కువగా ఉండటంతో ఎందుకైనా మంచిదని ముందస్తుగానే రిజిస్ట్రేషన్లు వాయిదా వేసుకుంటున్నారు. ఇప్పటికే ఒప్పంద పత్రాలు రాసుకున్న భూములను కోడ్ తర్వాత రిజిస్ట్రేషన్ చేయాలని రాసుకోవడం, మార్చుకోవడం వంటివి జరుగుతున్నాయి. పితృపక్షం సమయంలో మంచి రోజులు కాదని భావించి, చాలా మంది రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల కోడ్ కారణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం మరింత తగ్గుతుందని పలువురు అంటున్నారు.



వెలవెలబోతున్న కరీంనగర్ రిజిస్ట్రేషన్ ఆఫీస్



కరీంనగర్ గణేశ్‌నగర్‌లో మహాగౌరీ పూజలో పాల్గొన్న మహిళలు



మహాశక్తి ఆలయంలో అమ్మవారికి వివిధ రకాల పండ్లతో అలంకరణ

మంగళగౌరీ.. నమోస్తుతే..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలో నెలకొల్పిన అమ్మవార్లకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశక్తి ఆలయంలో మహాచండీ అవతారంలో అమ్మవారు దర్శనమివ్వగా.. వివిధ రకాల పండ్లతో అలంకరించారు. గణేశ్‌నగర్‌లో 108 మంది మహిళల ఆధ్వర్యంలో అష్టోత్తర మహాగౌరీ వ్రతం నిర్వహించారు. 53వ డివిజన్‌లో కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి అన్నదానం నిర్వహించారు. 15వ డివిజన్‌లో, 34వ డివిజన్ గోదాంగడ్డలో సామూహిక కుంకుమార్చన పూజల్లో మేయర్ సునీల్‌రావు దంపతులు పాల్గొన్నారు. –కరీంనగర్‌కల్చరల్

క్లుప్తంగా

మహిళలు ప్రచారంలో ముందుండాలి



కరీంనగర్‌టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు మహిళలు ప్రచారంలో ముందుండాలని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా డీసీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మహిళా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఏ ఎన్నికల్లోనైనా మహిళలదే కీలక పాత్ర అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తి అధికారపార్టీని ఇరుకున పెట్టడంలో సఫలీకృతులు కావాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడి, ప్రజల విశ్వాసాన్ని ఓట్ల ద్వారా చూరగొనాలని పిలుపునిచ్చారు. కలిసికట్టుగా పనిచేస్తూ మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. అనంతరం పద్మనగర్‌లో రాహుల్ గాంధీ పాదయాత్రలో పాల్గొనాలని గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మహిళా అబ్జర్వర్ సుప్రవీణ, చెర్ల పద్మ పాల్గొన్నారు.

17 మంది బైండోవర్

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 17మందిని తహసీల్దార్ రజిని ఎదుట బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మండలంలోని బెల్ట్‌షాపు నిర్వాహకులు, వివిధ కేసులు ఉన్న వారిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు సీఐ వివరించారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామానికి చెందిన ఓ గీత కార్మికుడు ఈత చెట్టపైనుంచి పడి గాయపడ్డాడు. గ్రామానికి చెందిన పెరుమండ్ల అనిల్(32) గురువారం సాయంత్రం ఈతచెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో కాలు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అనిల్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టీఆర్టీ ఉచిత శిక్షణకు గడువు పొడిగింపు

కరీంనగర్: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో టీఆర్టీ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు ఈనెల 21వ తేదీ వరకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా(జగిత్యాల,పెద్దపల్లి)కు చెందిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీలోపు సంబంధిత ధ్రువపత్రాలతో బీసీ స్టడీసర్కిల్‌లో నేరుగా లేదా స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 0878- 2268686 నంబరును సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

చొప్పదండి: కేంద్రం, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులను మోసం చేయడమే కాకుండా, ఒక్క డీఎస్సీ వేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జోన్ కార్యదర్శి యు. శ్రీనివాస్, గంగిపల్లి కుమార్, మారంపల్లి నాగభూషణం, రమేశ్, శేఖర్, సమ్మయ్య, కనుకరాజు, భూమయ్య, కనుకయ్య, రమేశ్, ఓదెలు, శ్రీనివాస్, సంతోశ్, అంజయ్య, పాల్గొన్నారు.

బాలికలకు కరాటే శిక్షణ

- 79 పాఠశాలల్లో ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు
- మూడు నెలలకు గానూ రూ.11.85 లక్షలు విడుదల



కరాటే శిక్షణలో విద్యార్థినులు(ఫైల్)

కరీంనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికలకు ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది స్కూళ్లలో నెల రోజులపాటు శిక్షణనివ్వగా ఈ ఏడాది మూడు నెలలపాటు వారానికి మూడు రోజులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దసరా సెలవుల అనంతరం.. నవంబరు మొదటి వారం నుంచి 'రాణీ లక్ష్మీబాయి రక్షా సంరక్షణ' పేరిట కరాటే శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారుల ద్వారా వారి ఎంపికకు కసరత్తు మొదలైంది. బాలికలు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా, ఆదర్శ విద్యాలయాల్లోనే కరాటే శిక్షణ ఇవ్వనున్నారు.

ఒక్కో పాఠశాలకు రూ.5 వేలు

జిల్లాలో ప్రాథమికోన్నత 4, ఉన్నత 75 మొత్తంగా 79 పాఠశాలలను గుర్తించారు. ఇందుకు సమగ్ర శిక్షా నుంచి ఒక్కో పాఠశాలకు నెలకు రూ.5 వేల చొప్పున మూడు నెలలకు నిధులు ఇవ్వనున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.60 వేలు, 75 ఉన్నత పాఠశాలలకు రూ.11.25 లక్షలను విద్యాశాఖ విడుదల చేసింది. నిపుణులైన శిక్షకులతో కరాటే నేర్పించనున్నారు. ఎంపిక చేసిన స్కూళ్లలో ఉదయం లేదా సాయంత్రం గంట సమయాన్ని కేటాయించనున్నారు.

ఆత్మస్థైర్యం పెంచేందుకే...

బాలికలు వేధింపులకు గురైన ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. వాటిని ఎదుర్కోలేక, ఫిర్యాదు చేసే ధైర్యం లేక సతమతమవుతున్నారు. ఈ తరుణంలో వారిలో ఆత్మస్థైర్యం పెంచేందుకు కరాటే శిక్షణ ఇవ్వాలని సర్కారు భావించింది. గతంలో జాతీయ బాలికల విద్యా పథకంలో భాగంగా జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని బాలికలకు కరాటే నేర్పించారు. ఈ పథకం రద్దు కావడంతో శిక్షణ నిలిచిపోయింది. 2015-16 విద్యాసంవత్సరం నుంచి మళ్లీ అమలు చేస్తున్నారు. కరోనా విపత్తు వల్ల రెండేళ్లు కరాటే నేర్పించలేదు. గతేడాది నెల రోజులు మాత్రమే శిక్షణ ఇచ్చారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నిధులు విడుదల కావడంతో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

'ప్రజా గర్జన'ను విజయవంతం చేయండి

- ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు గజ్జెల కాంతం



ప్రజాగర్జన పోస్టర్ ఆవిష్కరిస్తున్న గజ్జెల కాంతం

జమ్మికుంట: కరీంనగర్ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నవంబర్ 4వ తేదీన నిర్వహించే తెలంగాణ ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జెల కాంతం పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి రాష్ట్రాలను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. హిందూమతం ముసుగులో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రపన్నుతోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 700మంది రైతుల మృతికి బీజేపీ కారణం అని, సమస్యలపై నిరసన తెలిపిన రైతులపై విచక్షణారహితంగా దాడులు జరిపిందన్నారు. 33శాతం మహిళా బిల్లును స్వాగతిస్తామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ వాటా ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. 60శాతం ఉన్న బీసీల కులగణన చేపట్టకుండా అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మరోసారి అధికారంలోకి వస్తే దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, అనగారిన వర్గాలు, రైతులకు రక్షణ లేకుండా పోతోందని అన్నారు. అనంతరం ప్రజాగర్జన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సన్నీ, నాయకులు వీరస్వామిగౌడ్, బత్తుల పాండు, రాచపల్లి వంశీ, సలిగంటి సతీశ్, తాండ్ర శంకర్, పాతకాల ఓదెలు, మైసూర్ సాంబయ్య, రాచపల్లి సంపత్, సమ్మయ్య, రాచపల్లి శ్రీనివాస్, లాలయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక: హుజూరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంతో పాటు వీణవంక మండలంలో నర్సింహులపల్లి, కోరకల్, దేశాయిపల్లి, మల్లారెడ్డిపల్లి, గ్రామాలల్లోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీపీ రేణుక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాడ వనమాల సాధవరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, నల్ల సత్యనారాయణరెడ్డి, సంపత్ రెడ్డి, బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.1.60 లక్షలు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఒక వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.60 లక్షలు పట్టుబడ్డాయి. నగదును సీజ్ చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా రైల్వే కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా గురువారం రైల్వే క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ(ఆర్‌సీసీఎస్) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ద.మ.రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో జరిగిన ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, స్వతంత్ర అభ్యర్థులు మూడు ప్యానల్స్ బరిలో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో రైల్వే క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో సభ్యులు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులు. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని పదో నియోజకవర్గం రామగుండం. దీని పరిధిలో ఉప్పల్, పెద్దపల్లి, రామగుండం రైల్వే స్టేషన్, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, రామగుండం ఆర్‌ఓహెచ్, కరీంనగర్, ఆర్మూర్ రైల్వేస్టేషన్లు ఉండగా.. మొత్తం ఓటర్లు 2043 మంది ఉన్నారు. కేవలం రామగుండం రైల్వేస్టేషన్, ఆర్‌ఓహెచ్ షెడ్లలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 444 మంది ఓటర్లుండగా.. 310 ఓట్లు పోలయ్యాయి. బ్యాలెట్ బాక్సులను సికింద్రాబాద్‌లోని సీసీఎస్ కార్యాలయానికి తరలించారు.ఎన్నికల అధి కారులుగా రామగుండం స్టేషన్ మేనేజర్ మునిరామ్ మీనా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ ఉన్నారు.

డెంగీతో మహిళ మృతి



స్వరూప(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ డెంగీతో బాధపడుతూ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సమ్మెట స్వరూప(48) వారంక్రితం జ్వరం రావడంతో హనుమకొండ ఆస్పత్రిలో చేరింది. వైద్యులు డెంగీగా నిర్ధారించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.


ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

గోదావరిఖని: స్థానిక చంద్రబాబుకాలనీకి చెందిన కొరివి రవి(43) హమాలీ కార్మికుడు గురువారం ఉరేసుకొని మృతిచెందినట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య తెలిపారు. కొంతకాలంగా మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడుతుండేవాడని, బుధవారం రాత్రి తాగి వచ్చి భార్య, కుటుంబ సభ్యులను చితకబాదినట్లు పేర్కొన్నారు. రాత్రి ఇంటి పైకప్పుకు ఉరేసుకొని మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మద్యం దుకాణంలో అగ్ని ప్రమాదం

మంథని: మంథనిలోని ఆర్ఆర్ మద్య దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. బుధవారం రాత్రి దుకాణం మూసి వెళ్లగా.. గురువారం దుకాణం నుంచి మంటలు చెలరేగాయి. దుకాణం వెనుక వైపు ఉన్న పర్మిట్ రూం వైపు ఉన్న సీసీ కెమెరాను తొలగించి వట్టలను అంటించడంతో దాని ద్వారా మంటలు వ్యాప్తి చెంది దుకాణంలో రూ.6,50,000 మద్యం బాటిళ్లకు నష్టం వాటిల్లినట్లు కోండ్ల వెంకటరమణ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఆమె నేత్రాలు సజీవం



రామక్క(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కీసరి రామక్క(85) అనే వృద్ధురాలు అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా.. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్ ఆరీఫ్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. పుట్టెడు దుఃఖంలో కూడా సమాజ హితం కోసం సదుద్దేశంతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించాలని ఆమె నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు కిసరీ శంకరయ్య, అరుణ, నిర్మల, లింగంపల్లి, రాజమౌళి, శారదను సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, భీష్మాచారీ, రాజమౌళి, పద్మ, వాసు, రామకృష్ణా రెడ్డి, శంకర్ తదితరులు అభినందించారు.

వాహన తనిఖీలు ముమ్మరం చేయాలి

- కరీంనగర్ అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి



చెక్‌పోస్టు వద్ద పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి

బోయినపల్లి(చొప్పదండి): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని కరీంనగర్ అదనపు కలెక్టర్, చొప్పదండి ఎన్నికల ఆర్వో ప్రఫుల్ దేశాయి సూచించారు. కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని కొదురుపాక వద్ద ఏర్పాటు చేసిన నియోజకవర్గ చెక్ పోస్టును గురువారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే ఎన్నికల సిబ్బంది ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ పుష్పలత, ఆర్ఐ ప్రభాకర్ ఉన్నారు.

వ్యవసాయ పథకాలపై అవగాహన సదస్సు




పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన అధికారులు

తిమ్మాపూర్: వ్యవసాయ, అనుబంధశాఖల పథకాలపై ట్రెయినీ అసిస్టెంట్స్ సెక్షన్ ఆఫీసర్స్(సివిల్స్) రేణికుంట రైతువేదికలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి షబానా వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాల గురించి వివరించారు. రైతుబంధు, రైతు బీమా, గ్రామాల్లో సాగుచేస్తున్న పంటల వివరాలు, రుణమాఫీ, లబ్ధి పొందిన రైతుల గురించి తెలియజేశారు. అనంతరం ఆయిల్‌పామ్ తోటను సందర్శించారు. ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, రైతుబంధు సమితి సమితి సభ్యుడు బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ట్రైనీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు వెంకటేశ్, తరుణ్, కార్తీక్, సచిన్ ఎల్ఎండీ పోలీస్‌స్టేషను సందర్శించారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి పోలీసుల పనితీరు, ఫిర్యాదు స్వీకరించే విధానాన్ని వారికి వివరించారు.

ఆముదాలపల్లిలో గ్రూప్–1 శిక్షణ అధికారుల పర్యటన

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో గురువారం గ్రూప్- 1 శిక్షణ అధికారులు పర్యటించారు. గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానస, ఎంపీడీవో శ్రీవాణి, ఏపీవో శారద ఉన్నారు.

గేయ సంకలనం ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్: కవులు శబ్దశక్తిని, చందోగుణ అనురక్తిని కలగజేసుకుంటే మంచి గేయాలు అందించగలరని సినీ గేయ రచయిత, దర్శకుడు వడ్డేపల్లి కృష్ణ అన్నారు. భవాని సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'వజ్రభారతి'కి గేయ హారతి గేయ సంకలనాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కవులు శబ్దసంపదను పెంచుకోవాలని సూచించారు. మరో ముఖ్యఅతిథి విశ్రాంత చీఫ్ ఇంజినీర్ పారుపల్లి కోదండరామయ్య వైరాగ్యం ప్రభాకర్ రచించిన ఆకాశమంత కవితా సంపుటిని ఆవిష్కరించారు. మాతృభాషలో చదివిన వారు మాత్రమే రచనల్లో రాణిస్తారని, వారికి ఇతర భాషల్లోనే కాకుండా శాస్త్ర, సామాజిక అంశాల్లో పట్టు దొరుకుతుందని, ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిశోధనలు తెలుపుతున్నాయన్నారు. విశిష్ట అతిథి కవి, రచయిత, కాలమిస్ట్ పాణ్యం దత్తశర్మ మాట్లాడుతూ ఆకాశమంత కవిత్వంలో అలంకారాలు, మాత్రాఛందస్సులను విరివిగా వాడారని, వచన కవిత్వంలో కూడా వాటిని ఉపయోగించి కవితలకు సొబగులద్దారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కవులు లేదాళ్ల రాజేశ్వరరావు, కాసనగొట్టు స్వప్న కృష్ణ, నీలగిరి అనిత, అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, రేగులపాటి విజయలక్ష్మి, బొమ్మకంటి కిషన్, జనశ్రీ జనార్దన్, సంకెపల్లి నాగేంద్ర శర్మ, డాక్టర్ వెల్ముల కిషన్‌రావు, రాపర్తి వెంకటేశ్వర్లు, నగునూరి రాజన్న, దామరకుంట శంకరయ్య, గూడెపు కుమార్, యుగందర్ పాల్గొన్నారు.

హస్తం శ్రేణుల్లో నూతనోత్సాహం



కరీంనగర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

మంథని/కమాన్‌పూర్/పెద్దపల్లి రూరల్/కరీంనగర్ రూరల్/కొత్తపల్లి/కొండగట్టు: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల పర్యటన కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది. మంథని, పెద్దపల్లి, కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమాల్లో రాహుల్‌ను చూసేందుకు జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. మంథని నియోజకవర్గం పరిధిలోని కాటారం, కొయ్యూర్, మంథని, రామగిరి మండలాల్లో నిర్వహించిన కార్నర్‌మీటింగ్‌లో రాహుల్ గాంధీ ప్రసంగం హస్తం నేతల్లో నయాజోష్ తీసుకొచ్చింది. మంథని, కాటారంలో 30 నిమిషాలు రాహుల్ ప్రసంగించారు.

ఘన స్వాగతం పలికిన ప్రజలు

రాహుల్ గాంధీ చేపట్టిన బస్సుయాత్రకు కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ప్రజలు ఘన స్వాగతం పలికారు. కాన్వాయ్ ఎక్స్‌రోడ్డుకు చేరుకోగానే పూల వర్షం కురిపించారు. అక్కడ రాహుల్ ప్రసంగిస్తారని అంతా అనుకోగా.. కేవలం అభివాదం చేసి వెళ్లడం స్థానికులను కాస్త నిరుత్సాహ పరిచింది.

పెద్దపల్లిలో ఇలా..

రాహుల్‌గాంధీ పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోకి సబ్బితం గ్రామం వద్ద ప్రవేశించారు. బైక్‌ర్యాలీ, రోడ్‌షో ద్వారా పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన భారీ బహిరంగసభకు చేరుకున్నారు. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తంకుమార్‌రెడ్డి తెలుగులోకి అనువదించారు. నామీద 24 కేసులున్నాయి. మీ సీఎం కేసీఆర్‌పై ఒక్కకేసు కూడా ఎందుకు పెట్టలేదో గమనించాలని రాహుల్ అన్నారు. రాహుల్‌గాంధీ కేసీఆర్‌ను, రేవంత్‌రెడ్డి కేటీఆర్‌ను విమర్శించినప్పుడు సభలో స్పందన కనిపించింది. రాహుల్ ప్రసంగం పూర్తికాగానే రోడ్డుమార్గాన కరీంనగర్ బయల్దేరారు.

లైట్లులేక.. కాన్వాయ్ ఆగక

కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకుల సమన్వయ లోపంతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం రాత్రి మొగ్దుంపూర్‌స్టేజీ వద్ద ఆగకపోవడంతో కార్యకర్తలు నిరాశకు గురయ్యారు. పెద్దపల్లి సభలో పాల్గొన్న రాహుల్‌గాంధీ కరీంనగర్‌కు వస్తుండగా.. జిల్లా సరిహద్దు మొగ్దుంపూర్ వద్ద స్వాగతం పలికి ర్యాలీగా తీసుకెళ్లాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్ణయించింది. పార్టీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి, బొమ్మకల్ సర్పంచు పురుమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలను సమీకరించి రెడీగా ఉన్నారు. అయితే స్టేజీవద్ద స్థానిక నాయకులు విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రహదారంతా చీకటి మయంగా మారింది. రాహుల్‌గాంధీ కాన్వాయ్ ఆగకుండానే వెళ్లిపోవడంతో కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారు.



రాహుల్ బసచేసే హోటల్‌లో పోలీసుల తనిఖీలు

ప్రైవేట్ హోటల్‌లో బస

రాహుల్‌గాంధీ నగరంలో జగిత్యాల రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బసచేశారు. హోటల్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. హోటల్ మొత్తం కేంద్ర బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. హోటల్‌కు వచ్చే వారిని తనిఖీ చేస్తూ పరిసరాల్లో తిరిగే వారిపై నిఘాపెట్టారు. హోటల్‌వైపు ఉన్న మార్గాన్ని మూసివేసి వాహనాలు మళ్లించారు. నేటి ఉదయం రాహుల్‌గాంధీ బస్సుయాత్ర రామడుగు మండలం వెదిర, గంగాధర మీదుగా కొండగట్టు, జగిత్యాలకు వెళ్లనుంది.

నేడు కొండగట్టుకు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారిని నేడు ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ దర్శించుకుంటారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఆలయ అధికారులు మాత్రం తమకు ఎలాంటి సమాచారం లేదని వెల్లడించారు.



యోగా పోటీల విజేత 'కరీంనగర్‌'


కరీంనగర్‌ క్రీడాకారులకు ట్రోఫీ అందిస్తున్న చైర్మన్‌ రవీందర్‌ సింగ్‌


రెండో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టు

- తొమ్మిదోసారి విజయంతో జిల్లా జట్టు రికార్డు
- ట్రోఫీలు అందించిన రాష్ట్ర యోగా సంఘం చైర్మన్‌ రవీందర్‌ సింగ్‌
- ముగిసిన 10వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు


మూడో స్థానంలో నిలిచిన మహబూబ్‌నగర్‌ జట్టు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: తెలంగాణ ఆవిర్భావం నుంచి 10 (ఒకసారి కరోనా కారణంగా పోటీలు జరగలేదు) సార్లు రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. వరుసగా 9 సార్లు కరీంనగర్‌ జట్టే విజేతగా నిలిచింది. రెండు రోజులపాటు కరీంనగర్‌ పద్మనగర్‌లోని మానేర్‌ సెంట్రల్‌ స్కూల్‌లో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి యోగా గురువారం ముగిశాయి. కరీంనగర్‌ జట్టు మొత్తం 34 పాయింట్లతో చాంపియన్‌షిప్‌ కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా జట్టు క్రీడాకారులు 22 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో, మహబూబ్‌నగర్‌ జిల్లా జట్టు 16 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచింది. ఆయా జట్లకు రాష్ట్ర సివిల్‌ సప్లయ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ రవీందర్‌ సింగ్‌, రాష్ట్ర యోగా సంఘం చైర్మన్‌ రవీందర్‌ సింగ్‌ ట్రోఫీలు అందజేశారు.

జాతీయ పోటీల్లో పతకాలు సాధించాలి

రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న యోగా క్రీడాకారులు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని రాష్ట్ర యోగా సంఘం చైర్మన్‌ రవీందర్‌ సింగ్‌ అన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కరీంనగర్‌లో జాతీయస్థాయి యోగా పోటీలు నిర్వహించే అవకాశం వస్తే సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా ఒలింపిక్‌ సంఘం ప్యాట్రన్‌, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి యోగా పోటీలు ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా జరిగాయన్నారు. యోగా సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు జె.మనోహర్‌ కుమార్‌, నాగిరెడ్డి సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను నవంబర్‌ 23 నుంచి 26 వరకు గౌహతిలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఒలింపిక్‌ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌ రెడ్డి, యోగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, యోగా సంఘం బాధ్యులు కమలాకర్‌, బాలరాజు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరుస చాంపియన్‌షిప్‌లు..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొమ్మిది సార్లు వరుసగా చాంపియన్‌షిప్‌లు సాధించి, కరీంనగర్‌ జట్టు సరికొత్త రికార్డు సృష్టించింది. 2014లో మహబూబ్‌నగర్‌, 2015లో నిజామాబాద్‌, 2016లో ఆదిలాబాద్‌, 2017లో కరీంనగర్‌, 2018లో పెద్దపల్లి, 2019లో సరూర్‌నగర్‌, 2021లో కరీంనగర్‌, 2022లో రాజన్న సిరిసిల్ల, తాజాగా కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చాంపియన్‌గా నిలిచింది.

రజత పతకం సాధించా



రాష్ట్రస్థాయి పోటీల్లో నేను 18–21 విభాగంలో పోటీ పడ్డాను. రజత పతకం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. మూడుసార్లు జాతీయ స్థాయికి వెళ్లాను. ఈసారి పతకం సాధించేందుకు బాగా ప్రాక్టీస్‌ చేస్తా.

– ఎం.వెంకటేశ్‌, సూరారం

జాతీయ పోటీల్లో పతకమే లక్ష్యం



జిల్లా జట్టు చాంపియన్‌గా నిలవడం సంతోషంగా ఉంది. గతంలో రెండుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. 18–21 విభాగంలో రజతం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. అక్కడ పతకం సాధించడమే లక్ష్యం.

– ఎస్‌.శ్రీనిధి, మల్లాపూర్‌

ఫస్ట్‌ టైమ్‌ ఎంపికయ్యాను



నేను ఇప్పటివరకు రెండు సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఫస్ట్‌ టైమ్‌ జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. 8–10 విభాగంలో కాంస్య పతకం సాధించి, జాతీయ పోటీలకు సెలెక్ట్‌ అయ్యాను. అక్కడ పతకం సాధించాలని ఉంది.

– జి.మన్విత్‌ రామ్‌, కరీంనగర్‌

పండుగ వేళ.. రైళ్లు కిటకిట



రామగుండం: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని హైదరాబాద్‌ నుంచి వచ్చే రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్‌ నుంచి కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్‌, చంద్రాపూర్‌, బల్లార్షా వైపు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో బోగీల్లో నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. దసరా నాటికి మరింత పెరిగే అవకాశం ఉంటుందని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వ్యవసాయ పాలిటెక్నిక్‌ క్రీడలు


పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన జగిత్యాల జట్టు


బాలబాలికల విభాగంలో ప్రతిభ చూపిన మధిర జట్టు

- బాలుర విభాగంలో ఓవరాల్‌ చాంపియన్‌ పాలెం జట్టు
- బాలికల విభాగంలో ఓవరాల్‌ చాంపియన్‌ తోర్నాల జట్టు
- బాలబాలికల విభాగంలో మధిర జట్టు ప్రతిభ


మాట్లాడుతున్న వ్యవసాయ వర్సిటీ అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్‌: జగిత్యాల జిల్లాకేంద్రంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా వ్యవసాయ వర్సిటీ ఉన్నతాధికారులు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందించారు.

బాలుర విభాగంలో పాలెం జట్టు

బాలుర విభాగంలో ఓవరాల్‌ చాంపియన్‌గా నాగర్‌కర్నూల్‌ జిల్లాలోని పాలెం జట్టు సాధించింది. ఈ జట్టు షాట్‌పుట్‌, జావలిన్‌ త్రో, లాంగ్‌ జంప్‌, టేబుల్‌ టెన్నిస్‌లో ప్రథమస్థానంలో నిలిచింది. డిస్కస్‌త్రో, షటిల్‌, బ్యాడ్మింటన్‌, 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్‌ విభాగాల్లో రెండోస్థానం సాధించింది. చెస్‌, 4 మీటర్ల రిలే విభాగంలో మూడో బహుమతి సాధించారు. బాలికల జట్టు టేబుల్‌ టెన్నిస్‌లో రెండోస్థానం, 100 మీటర్లు, 4 మీటర్ల రిలే విభాగంలో మూడో బహుమతి, క్విజ్‌, పాటల పోటీల్లో రెండోస్థానం, ముగ్గుల పోటీల్లో రెండో స్థానం, పాటల పోటీలో మొదటి స్థానంలో నిలిచింది.

బాలికల విభాగంలో తోర్నాల జట్టు

బాలికల విభాగంలో సిద్దిపేట జిల్లాలోని తోర్నాల జట్టు ఓవరాల్‌ చాంపియన్‌ షిప్‌ సాధించింది. త్రోబాల్‌, టెన్నికాయిట్‌, లాంగ్‌జంప్‌లో మొదటి బహుమతి, బ్యాడ్మింటన్‌, డిస్కస్‌ త్రో, షాట్‌పుట్‌, జావెలిన్‌త్రో, 100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్‌, 400 రిలే పరుగు పందెంలో రెండో బహుమతి సాధించారు. బాలుర విభాగంలో 400 మీటర్ల రిలేలో మొదటి బహుమతి, జావెలిన్‌ త్రో, 200మీ రన్నింగ్‌లో మూడో స్థానం సాధించారు.

బాలబాలికల విభాగంలో మధిర జట్టు

బాలురు, బాలికల విభాగంలో మధిర జట్టు ప్రతిభ కనబరించింది. బాలుర విభాగం షాట్‌పుట్‌లో రెండో బహుమతి, క్విజ్‌లో మూడో బహుమతి సాధించింది. బాలికల విభాగంలో చెస్‌లో రెండో బహుమతి, లాంగ్‌జంప్‌లో మూడోస్థానం, వ్యాసరచన పోటీల్లో మొదటి, క్విజ్‌లో మూడోస్థానం, సోలో డ్యాన్స్‌లో మొదటి స్థానం, గ్రూప్‌ డ్యాన్స్‌లో మొదటి స్థానం, కల్చరల్‌, లిటరరీ పోటీల్లో ఓవరాల్‌ చాంపియన్‌గా నిలిచింది.

పలు విభాగాల్లో ఆతిథ్య జట్టు ప్రతిభ

ఆతిథ్య జగిత్యాల జట్టు పలు విభాగాల్లో ప్రతిభ చాటింది. బాలికల విభాగంలో క్యారమ్స్‌, టెన్నికాయిట్‌, 200 మీటర్ల రన్నింగ్‌ డ్యాన్స్‌లలో రెండో బహుమతి, బ్యాడ్మింటన్‌, జావలిన్‌ త్రో, డిస్కస్‌ త్రో, షాట్‌పుట్‌, రంగోలిలో మొదటి బహుమతి సాధించారు. బాలుర విభాగంలో బ్యాడ్మింటన్‌, ఉపన్యాస పోటీలో మొదటి బహుమతి, టేబుల్‌ టెన్నిస్‌, లాంగ్‌జంప్‌లో రెండో బహుమతి పొందారు.

నైపుణ్యాలు ఉంటేనే గుర్తింపు

విద్యార్థి దశ నుంచే నైపుణ్యంపై దృష్టి సారించాలని, అప్పుడే గుర్తింపుతోపాటు ఉపాధి లభిస్తుందని ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ డీన్‌ డాక్టర్‌ సీమా అన్నారు. క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. చదవు, ఉన్నత ఉద్యోగం మాత్రమే జీవితానికి సరిపోదని, సంస్కారంతోపాటు అదనపురంగంలో ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. స్థానిక పాలిటెక్నిక్‌ డైరెక్టర్‌ పద్మజ మాట్లాడుతూ వ్యవసాయ కోర్సులతో ఉపాధి పొందడంతోపాటు రైతులకు సేవ చేయాలని సూచించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వ్యవసాయ వర్సిటీ క్రీడల పరిశీలకులు సురేష్‌ అన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రీడలను చాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్‌ డీన్‌ భారతినారయణ్‌ భట్‌ మాట్లాడుతూ క్రీడల్లో మరింతగా రాణించేందుకు రాష్ట్ర స్థాయి క్రీడలు ఉపయోగపడతాయన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ కళాశాల, వ్యవసాయ పాలిటెక్నిక్‌ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

స్కందమాతగా అమ్మవారు



ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు గురువారం స్కందమాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధమైన రామలింగేశ్వరస్వామి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఐదోరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపురంగు చీరలో అలంకరించారు. పట్టణంలోని న్యూ టీటీడీ కల్యాణ మండపంలో నవదుర్గా సేవాసమితి మహా అన్నదానం చేపట్టింది.

వెలమల క్షేత్రం..!

- జీసీలకు రెండేసార్లు అవకాశం
- కార్మిక, కర్షక ప్రాంతం


జీవీ సుధాకర్‌రావు


జీ.వీ.పితాంబర్‌రావు



కోదాటి రాజమల్లు



చుంచు లక్ష్మయ్య


మురళీమనోహర్‌రావు


గోనె హన్మంతరావు


గడ్డం అరవిందరెడ్డి


నడిపెల్లి దివాకర్‌రావు


కే.వి.కిషన్‌రావు



మంచిర్యాల ముఖ చిత్రం

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): మంచిర్యాల శాసనసభ నియోజకవర్గం వెలమలకు కంచుకోటగా ఉంటూ వస్తోంది. పునర్విభజనకు ముందు లక్సెట్టిపేట నియోజకవర్గంలో మొదటి నుంచీ అగ్రవర్ణాలకు అధికారం దక్కింది. కార్మిక, కర్షక ఓటర్లు ఎక్కువగా ఉన్నా రాజకీయ ప్రస్థానం అలాగే కొనసాగుతోంది. లక్సెట్టిపేట నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. ఇప్పటివరకు 16 సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వెలమ సామాజిక వర్గం నేతలే ఎక్కువ కాలం పాలించారు. 1952లో ద్విసభ్య నియోజకవర్గం కాగా.. సోషలిస్ట్‌ పార్టీ ప్రభావం ఉన్న రోజుల్లో ఆ పార్టీ తరఫున కోదాటి రాజమల్లు, విశ్వనాథం ఒకే పర్యాయం శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మంచిర్యాల నియోజకవర్గంగా ఆవిర్భవించింది. మొదటి ఎమ్మెల్యేగా గడ్డం అరవిందరెడ్డి టీఆర్‌ఎస్‌ నుంచి ఎన్నికయ్యారు. 2010 ఉప ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. 2014 సాధారణ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి నడిపెల్లి దివాకర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

కీలక పదవులు

లక్సెట్టిపేట నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు కీలక పదవుల్లో కొనసాగారు. జేవీ.నర్సింగరావు పీసీసీ అధ్యక్షుడిగా, ఉప ముఖ్యమంత్రిగా, జీవీ.సుధాకర్‌రావు నీటి పారుదల, రవాణా, చక్కెర శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

విలక్షణ తీర్పు..

నియోజకవర్గ ప్రజలు విలక్షణమైన తీర్పునిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో హ్యాట్రిక్‌ సాధించిన ఎమ్మెల్యే లేకపోవడం గమనార్హం. ఇప్పటివరకు జీవీ.పితాంబర్‌రావు, జీవీ.సుధాకర్‌రావు, జేవీ.నర్సింగరావు, దివాకర్‌రావు వరుసగా రెండేసి సార్లు ఎన్నికైనా మూడోసారి ఎన్నికై హ్యాట్రిక్‌ కొట్టే అవకాశం దక్కలేదు.

కార్మికులు, వ్యవసాయం

మంచిర్యాల నియోజకవర్గానికి తూర్పున సింగరేణి కార్మిక క్షేత్రం, పశ్చిమాన వ్యవసాయ క్షేత్రం ఉండగా, మధ్యలో మంచిర్యాల విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా ప్రత్యేకతను సంతరించుకుంది. ఏ ఎన్నికల్లో అయినా సింగరేణి క్షేత్రంలోని కార్మికులే నేతల రాతలు మారుస్తున్నారు. 10 వేల వరకు సింగరేణి కార్మిక కుటుంబాలు ఉండగా దాదాపు 45 వేలకు పైగా ఓటర్లు ఉంటారు. బీసీ ఓటర్లు కీలకంగా ఉన్నా చట్టసభకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కడం లేదు. 2.65లక్షల పైగా ఓటర్లు ఉండగా ఇందులో దాదాపు రెండు లక్షల వరకు బీసీ ఓటర్లు ఉంటారు.

నియోజకవర్గ స్వరూపం

నియోజకవర్గంలో మంచిర్యాల, నస్పూర్‌, లక్సెట్టిపేట మున్సిపాలిటీలు, హాజీపూర్‌, దండేపల్లి మండలాలు ఉన్నాయి. 2,64,515 మంది ఓటర్లు ఉన్నారు. మున్నూరు కాపు, పెరిక ఓటర్ల ప్రాతినిధ్యం అధికంగా ఉండగా ఆ తర్వాత వరుసలో ఎస్సీ, ఎస్టీలు, ముస్లిం మైనారిటీ, బెస్త, వైశ్య, పద్మశాలి, రెడ్డి, వెలమ, ఎల్లాపు ఇతర కులాల వారు ఉంటారు.

ఉప ఎన్నికలు ఇలా..

1973లో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న జేవీ.నర్సింగ్‌రావు అకాల మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో మందమర్రికి చెందిన న్యాయవాది కేవీ.కిషన్‌రావు కాంగ్రెస్‌ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985లో ఎన్టీ రామారావు ప్రభుత్వం రద్దు కావడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి 2010లో టీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ ఆదేశాల మేరకు రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు వచ్చాయి. ఉప ఎన్నికల్లో అరవింద్‌రెడ్డి 86 వేల ఓట్ల పై చిలుకు మెజారిటీతో విజయం సాధించారు.

ఎన్నో ప్రత్యేకతలు..

మంచిర్యాల గోదావరి పరీవాహక ప్రాంతం ఉంది. తూర్పున శ్రీరాంపూర్‌లో నల్ల బంగారం నిక్షిప్తమైన సింగరేణి భూగర్భ, ఉపరితల(ఓపెన్‌ కాస్ట్‌) గనులు ఉన్నాయి. మంచిర్యాలలో ఎంసీసీ సిమెంట్‌ ఫ్యాక్టరీ, పరిసర ప్రాంతాల్లో సిరామిక్‌ పరిశ్రమలు ఉన్నాయి. ఎల్లంపల్లి శ్రీపాదసాగర్‌ ప్రాజెక్ట్‌ ఉంది. లక్సెట్టిపేటలో రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద చర్చి సీఎస్‌ఐ చర్చి ఉంది. దండేపల్లిలో చిన్నయ్య, పెద్దయ్య గుట్టలతో పాటు చప్పట్లతో జాలువారే నీటి ఊటలు ప్రత్యేకత.

లక్సెట్టిపేట నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు..

ఎమ్మెల్యే	పదవీ కాలం	పార్టీ
విశ్వనాథరావు, కోదాటి రాజమల్లు	1952–57	సోషలిస్టు పార్టీ
జీవీ.పితాంబర్‌రావు	1957–62	కాంగ్రెస్‌
జీవీ.పితాంబర్‌రావు	1962–67	స్వతంత్ర
జేవీ.నర్సింగరావు	1967–72	కాంగ్రెస్‌
జేవీ.నర్సింగరావు	1972–73	కాంగ్రెస్‌
కేవీ.కిషన్‌రావు(ఉప ఎన్నిక)	1973–77	కాంగ్రెస్‌
చుంచు లక్ష్మయ్య	1977–83	జనతా పార్టీ
ఎం.మురళీమనోహర్‌రావు	1983–85	టీడీపీ
జీవీ.సుధాకర్‌రావు(ఉప ఎన్నిక)	1985–89	స్వతంత్ర
జీవీ.సుధాకర్‌రావు	1989–94	కాంగ్రెస్‌
గోనె హన్మంతరావు	1994–99	టీడీపీ
నడిపెల్లి దివాకర్‌రావు	1999–04	కాంగ్రెస్‌
నడిపెల్లి దివాకర్‌రావు	2004–09	కాంగ్రెస్‌
మంచిర్యాల నియోజకవర్గంలో...		
గడ్డం అరవింద్‌రెడ్డి	2009–10	టీఆర్‌ఎస్‌
గడ్డం అరవింద్‌రెడ్డి(ఉప ఎన్నిక)	2010–14	టీఆర్‌ఎస్‌
నడిపెల్లి దివాకర్‌రావు	2014–18	టీఆర్‌ఎస్‌
నడిపెల్లి దివాకర్‌రావు	2018–23	బీఆర్‌ఎస్‌

బాసరలో నేడు మూల నక్షత్ర పూజలు


ముస్తాబైన సరస్వతీ ఆలయం

- అధికసంఖ్యలో రానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


బాసరకు పాదయాత్రగా వస్తున్న కామోల్‌ భక్తులు

భైంసా: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బాసరలో శుక్రవారం విశేష మూల నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. పూజల్లో పాల్గొనేందుకు భక్తులు అధికసంఖ్యలో రానుండడంతో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈవో విజయరామారావు ఇప్పటికే అర్చకులు, సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. శుక్రవారం జ్ఞానసరస్వతీ అమ్మవారి సన్నిధిలో నిర్వహించనున్న అక్షర శ్రీకార పూజలు, అభిషేక పూజల కోసం టికెట్‌ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాగా, మూల నక్షత్రం రోజున పలు ప్రాంతాల నుంచి భక్తులంతా పాదయాత్రగా బాసరకు వస్తుంటారు. ఒకరోజు ముందే చేరుకుని అమ్మవారి ఆలయంలో బసచేస్తారు. మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుంటారు. భైంసా మండలం కామోల్‌ గ్రామానికి చెందిన భక్తులు ఐదేళ్లుగా పాదయాత్రగా బాసరకు వస్తున్నారు. ఈసారి కూడా పాదయాత్ర ప్రారంభించారు. కాగా, దసరా ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలో ఉండి ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకుంటామని ఆ గ్రామానికి చెందిన గంగారెడ్డి తెలిపారు. ఐదేళ్లుగా భక్తులమంతా కలిసి పాదయాత్రగా బాసరకు చేరుకుంటున్నట్లు చెప్పారు.

అక్రమ మద్యాన్ని కట్టడి చేయాలి


అధికారులతో సమీక్షిస్తున్న నర్సింహారెడ్డి

- ఎక్సైజ్‌ డెప్యూటీ కమిషనర్‌ నర్సింహారెడ్డి
- అంతర్రాష్ట్ర అబ్కారీ అధికారులతో సమీక్ష

ఆదిలాబాద్‌టౌన్‌: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యాన్ని పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని ఎక్సైజ్‌శాఖ డెప్యూటీ కమిషనర్‌ నర్సింహారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ సమావేశ మందిరంలో మహారాష్ట్ర, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్‌ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ అక్కడి నుంచి ఉమ్మడి జిల్లా పరిధిలోకి మద్యం రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రత్యేక తనిఖీ బృందాలతో నిరంతర నిఘా ఉంచాలన్నారు. సమాచారం అందిన వెంటనే అధికారులకు చేరవేయాలన్నారు. పాత నేరస్థులను బైండోవర్‌ చేసి వారిపై నిఘా పెట్టాలన్నారు. కొత్తగా చెక్‌పోస్ట్‌ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్‌, అమరావతి, యావత్‌మాల్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్లు నితీష్‌ షిండే, పాటిల్‌ సంజయ్‌, షేర్‌ సాగర్‌, పాంఢ్రకవడ, రాజురా సీఐలు జయంత్‌, తండ్వే, ఆదిలాబాద్‌, నిర్మల్‌, మంచిర్యాల, ఆసిఫాబాద్‌ జిల్లాల ఎక్సైజ్‌ సూపరింటెండెంట్లు హిమశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, నందగోపాల్‌, జ్యోతి కిరణ్‌, ఆదిలాబాద్‌ సీఐ శ్రీనివాస్‌, అధికారులు సమ్మయ్య, మోయిన్‌ అలీ, రాజేశ్‌కుమార్‌, మిలేష్‌, తదితరులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

- పోలీసుల అదుపులో 42 మంది
- రూ.2.51 లక్షలు, 12, కార్లు, 43 సెల్‌ఫోన్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కార్లు


స్వాధీనం చేసుకున్న నగదు

చెన్నూర్‌: చెన్నూర్‌ సమీపంలోని గోదావరి నది ఒడ్డున గురువారం తెల్లవారుజాము పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. పక్కా సమాచారంతోనే దాడి చేసి 42 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.51 లక్షల నగదు, 43 సెల్‌ఫోన్లు, 12 కార్లు, 2 చార్జింగ్‌ లైట్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ వాసుదేవరావు తెలిపారు. వీరంతా గోదావరిఖని, ఎన్టీపీసీ, రామగుండం, బెల్లంపల్లి, మందమర్రి, కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన వారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పేకాట స్థావరాలు మార్చుకుంటూ..

వివిధ ప్రాంతాల్లో కొందరు రాత్రివేళ పేకాట ఆడుతున్నారు. పోలీసు నిఘా ఉన్న ప్రాంతాలను గమనించి పేకాట స్థావరాలను మార్చుకుంటున్నారు. గతేడాది మహారాష్ట్రలో పేకాట ఆడి తిరుగుప్రయాణంలో కోటపల్లి మండలం రాపన్‌పల్లి మీదుగా వస్తున్న మూడు కార్లను పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణలోని జిల్లాలోనే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లి పేకాట ఆడుతున్నారని సమాచారం.